క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీగా సుశీల



సామర్లకోట: సీనియర్ ఫ్యాకల్టీగా స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో కె.సుశీల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఫ్యాకల్టీగా పని చేసిన ఆమె బదిలీపై కొవ్వూరు వెళ్లారు. కొవ్వూరులో ఎంపీడీఓగా పని చేసి, మరలా బదిలీపై తిరిగి సీనియర్ ఫ్యాకల్టీగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. విస్తరణ శిక్షణా కేంద్రంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులకు శిక్షణ ఇస్తుంటారు. వివిధ అంశాలపై అనుభవం ఉన్న వారిని ఫ్యాకల్టీగా నియమిస్తారు. ఈఓపీఆర్డీ స్థాయి నుంచి డిప్యూటీ సీఈఓ స్థాయి ఉన్న అధికారులు ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు.

చేపల చెరువు వివాదంపై పాడా పీడీ ఆరా



చెందుర్తిలో చేపల చెరువును పరిశీలిస్తున్న పీడీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి పెద్ద చెరువులో చేపల పట్టుకునే విషయంలో వివాదంపై పాడా పీడీ చైత్రవర్షిణి ఆరా తీశారు. శుక్రవారం చెందుర్తిలో చేపల చెరువును పరిశీలించిన ఆమె.. రెండు సంఘాలకు సంబంధించిన వారితో చర్చించారు. వివాదాన్ని పరిష్కరించడానికి రెండు సంఘాల సభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వివాదం వల్ల సమస్య మరింత జటిలం అవుతుందని, ప్రయోజనం ఉండదని, ఇరు వర్గాలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఆమె వెంట మత్స్య శాఖాధికారి రామకృష్ణ, తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ శ్రీనివాస్, ఎస్సై రామకృష్ణ తదితరులున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు హాజరు కావాలని కోరారు.

సామర్లకోట: పట్టణంలోని అభివృద్ధి పనులపై చర్చించడానికి ప్రతి నెలా నిర్వహించే పాలక మండలి సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత వహిస్తారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జరిగే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి 56 అంశాలతో అజెండాను రూపొందించారన్నారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు హాజరు కావాలన్నారు.

రామలింగేశ్వరునికి మాస శివరాత్రి పూజలు



పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉన్న పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం ఫాల్గుణ మాసం, మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు స్వామివారికి పంచామృతాలతో, హరిద్ర, కుంకుమ, సుగంధ జలాలతో అభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరానికి చెందిన కల్లుగీత కార్మికుడు గుత్తుత్తి అప్పారావు (68) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ ఢీకొని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏకే మల్లవరం నుంచి ఏపీ మల్లవరానికి సైకిల్‌పై వెళ్తున్న అప్పారావును మోటర్ సైకిల్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దాంతో కుటుంబ సభ్యులు ముందుగా పిఠాపురం సీహెచ్‌సీకి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని పెద్ద కుమారుడు వెంకట సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అంతా ఇన్‌చార్జి పాలనేనా?

- వలు అంశాలపై కౌన్సిలర్ల ఆందోళన
- ఉదయం ఆగి.. సాయంత్రం కొనసాగింపు
- గొల్లప్రోలు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం



సమావేశంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: అధికారులు రారు, కమిషనర్ అసలే రారు, మరెందుకు పెట్టారు ఈ సమావేశం? అసలే నియోజకవర్గంలో ఇన్‌చార్జి పాలన సాగుతోంది, అధికారులు.. ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు.. ఇదేం దౌర్భాగ్య అంటు కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఉదయం సమావేశం ప్రారంభం కాగానే అధికారులెవరూ అందుబాటులో లేరు. మూడు నెలల నుంచి వాయిదా పడిన అంశాలు అజెండాలో ఉన్నాయి. అధికారులు లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ కౌన్సిలర్ గుళ్ల సుబ్బారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరో వార్డు కౌన్సిలర్ గొల్లపల్లి అచ్యుతాంబ కలుగజేసుకుని, ఇలాంటి మీటింగులకు తమను పిలవొద్దన్నారు. సీనియర్ కౌన్సిలర్ గంట అప్పలస్వామి, పదో వార్డ్ కౌన్సిలర్ మొగలి దుర్గానందరావు తదితర 8 మంది కౌన్సిలర్లు.. ప్రజా సమస్యలను తాము ఎవరికి చెప్పుకోవాలంటూ మూకుమ్మడిగా అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ గంట అప్పలస్వామి మాట్లాడుతూ, గతంలో రూ.5 లక్షలు లైట్లకు టేబుల్ అజెండా పెట్టామని, చైర్‌పర్సన్ అనుమతి ఇవ్వలేదని చెబుతుండగా, ఇన్‌చార్జి మేనేజర్ నవీన్ మాట్లాడుతూ, ఇన్‌చార్జి మంత్రి మీటింగ్ ఉండటం వల్ల కమిషనర్ వెళ్లారని, సమస్యలపై చర్చించి, సమాధానాలు చెప్పడానికి ఇన్‌చార్జి అధికారులు సిద్ధం చేశామన్నారు. అనధికార లేఅవుట్లపై గత సమావేశంలో అడిగామని, స్పష్టత లేకుండా రెండు కాగితాలు ముఖాన కొట్టారని అప్పలస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ మంత్రి మీటింగ్‌కి వెళ్లారని, సమావేశం కొనసాగిద్దామని కౌన్సిలర్ శ్రీరామచంద్రమూర్తి అనగా, అందుకు మిగిలిన కౌన్సిలర్లు వ్యతిరేకించారు. అలాంటప్పుడు సాయంత్రం కానీ, సోమవారం కానీ మీటింగ్ వాయిదా వేయాలని కౌన్సిలర్లు కోరారు. నెల క్రితం లేఅవుట్లపై అడిగితే, గురువారం హడావుడిగా బోర్డులు పెట్టారని అప్పలస్వామి అన్నారు. సమావేశాన్ని సాయంత్రం నాలుగు గంటలకు కొనసాగిస్తామని చైర్‌పర్సన్ మంగతాయారు ప్రకటించారు. దీంతో కౌన్సిలర్లు బయటకు వచ్చి, డబ్బులిచ్చుకో.. బిల్డింగ్ కట్టుకో.. డబ్బులిచ్చినోళ్లకే పనులు అంటూ పలు ఆరోపణలతో మున్సిపల్ సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సాయంత్రం కొనసాగింపు

అధికారులు హాజరు కావడంతో సాయంత్రం సమావేశం కొనసాగింది. నాన్ లేఅవుట్లపై గత సమావేశంలో కౌన్సిలర్లు అడిగిన వివరాలు సక్రమంగా అందించలేదని గుళ్ల సుబ్బారావు, అప్పలస్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతి లేని లేఅవుట్ల సర్వే నంబర్లు ఇస్తే, అవి ఎక్కడున్నాయో, ఎవరి పేర్లు ఉన్నాయో ఆఫీసుల చుట్టూ తిరిగి తెలుసుకోవాలా అంటూ అధికారులను ప్రశ్నించారు. గురువారం పెట్టిన లేఅవుట్ల బోర్డులపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. టీపీఓ దీప్తి మాట్లాడుతూ, గతంలో ఉన్న లేఅవుట్ల వివరాలను అందించానని, కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో కమిషనర్ కనకారావు కలగజేసుకుని, సామాన్య ప్రజలు నష్టపోకుండా 20 ఏళ్ల నుంచి ఉన్న 40 అడుగుల రోడ్ల నిబంధన 30 అడుగులకు మార్చారన్నారు. నాన్ లేఅవుట్లలో ప్రజలకు నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామని, వచ్చే నెల 5 తర్వాత స్వయంగా లేఅవుట్లు పరిశీలిస్తానని, కౌన్సిలర్లకు కావాల్సిన సమాచారం రెండు రోజుల్లో అందించాలని దీప్తిని ఆదేశించారు.

పనులు అసంపూర్తిగా చేశారు

అభివృద్ధి కార్యక్రమాలకు నగర పంచాయతీ ఆదాయం తక్కువగా ఉండటం వల్ల ఆటంకం ఏర్పడుతుందని, గతంలో జరిగిన పనులు ఎలా జరిగినప్పటికీ భవిష్యత్తులో జరిగే పనులు సంతృప్తికరంగా చేపడతామని కమిషనర్ తెలిపారు. ఆరో వార్డు కౌన్సిలర్ గొల్లపల్లి అచ్చుతాంబ మాట్లాడుతూ పూడికతీత పనులు 13వ వార్డులో సగం చేసి వదిలేశారని చెప్పారు. కౌన్సిలర్ గుళ్ల సుబ్బారావు మాట్లాడుతూ, రూ.16 లక్షలు మురుగు కాలువల్లో పూడిక తీయటానికి అని పెట్టి, సగం పనులే చేశారని, అసలు పూర్తిగా తీస్తారా, లేదా అని ప్రశ్నించారు. కమిషనర్ కనకారావు సమాధానమిస్తూ, పూడికతీత పనులు సంపూర్ణంగా పూర్తయ్యేటట్లు చూడాలని సచివాలయం ఏఈలను ఆదేశించారు. కాపు నేస్తం సభ నిర్వహణ బిల్లు అంశం చదువుతుండగా, కౌన్సిలర్ అప్పలస్వామి, గుళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ఈ బిల్లు గతంలోనే చెల్లించారు కదా అని చెప్పారు. దీంతో కమిషనర్ కలగజేసుకుని, వివరాలు పూర్తిగా పరిశీలించి అప్పుడు బిల్లు చెల్లించాలని, ఒకవేళ బిల్లు చెల్లించి ఉంటే వారిపై క్రిమినల్ చర్యలకు ప్రతిపాదించాలని చెప్పారు. స్టార్ట్ అప్ గ్రాంట్ వినియోగంపై చర్చించారు. సమావేశంలో వైస్ చైర్మన్ గంధం నాగేశ్వర రావు పాల్గొన్నారు.

టెన్త్‌కు పది మంది గైర్హాజరు

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం సామాన్య శాస్త్రం పరీక్షకు పది మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మండలంలో 1,501 మంది విద్యార్థుల కోసం పట్టణంలో ఐదు, మండల పరిధిలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు 10 పరీక్షా కేంద్రాల్లో 1,491 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు, వైద్య శిబిరం నిర్వహించినట్టు చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

సోషల్ పరీక్ష ఒకటికి వాయిదా

పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఈ నెల 31న జరగాల్సిన సోషల్ పరీక్ష ఏప్రిల్ ఒకటికి వాయిదా వేసినట్లు డీఈఓ ప్రకటించారని ఎంఈఓ శివరామకృష్ణయ్య శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 31న రంజాన్‌ను పురస్కరించుకుని పరీక్ష వాయిదా వేశారన్నారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వాకపల్లి దేవి



పిఠాపురం: కొత్తగా పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా వాకపల్లి దేవి నియమితులయ్యారు. తొలిసారి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళకు అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే తర్వాత నియోజకవర్గ స్థాయిలో ప్రోటోకాల్ ఉన్న పదవి కావడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

వేసవిలో బోరు నీరే శరణ్యం!

ఫిల్టర్ ప్లాంట్‌లో బోరు తవ్వకం



సామర్లకోట ఫిల్టర్ ప్లాంట్ ఆవరణలో తవ్వుతున్న బోరు

సామర్లకోట: వేసవి కాలంలో ప్రజలకు బోరు నీటినే తాగునీటిగా సరఫరా చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గోదావరి కాలువ జలాలను నాగార్జున ఫిల్టరు చెరువులో నింపి, వాటిని ఫిల్టర్ ప్లాంట్‌లో శుద్ధి చేసి, ప్రజలకు తాగునీరుగా సరఫరా చేయాల్సి ఉంది. నాగార్జున ఫిల్టరు చెరువులోని నీరు నాచు కట్టి, ఆకుపచ్చ రంగులోకి మారింది. దీంతో ఆ చెరువులో నీటి వాడకాన్ని నాలుగు నెలలుగా నిలిపివేశారు. చెరువులోకి వచ్చే నీటిని ఫిల్టర్ ప్లాంటులోకి మళ్లించి, ఆ నీటిని శుద్ధి చేసి తాగునీరుగా అందజేస్తున్నారు. నాగార్జున చెరువులో నీటిని పూర్తిగా తొలగించాలని కలెక్టరు నుంచి ఆదేశాలు రావడంతో, నీటిని బయటకు పంపే ప్రక్రియ చేస్తున్నారు. చెరువులో నీరు పూర్తిగా పోవడానికి వారం రోజులు పడుతుందని చెబుతున్నారు. ఏప్రిల్‌లో గోదావరి కాలువను కట్టి వేస్తే, చెరువులోకి నీరు నింపే అవకాశం ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఫిల్టర్ ప్లాంట్ ఆవరణలో కొత్తగా రెండు బోర్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఓ బోరు తవ్వకం పనులు జోరుగా జరుగుతున్నాయి. దాంతో వేసవి కాలంలో ప్రజలకు బోరు నీరు ఇచ్చే అవకాశం ఉంది. దీని వలన మున్సిపాలిటీపై అదనపు భారం ఏర్పడుతుందని చర్చించుకుంటున్నారు. బోర్ల వద్ద ఆపరేటర్లు ఉండాలి. అదనంగా కరెంటు బిల్లు వస్తుంది. బోరు నీరిస్తే ప్రజల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉంది.

మండుటెండలో ప్రజల పాట్లు

- ఈ-కేవైసీ నమోదుకు తప్పని అవస్థలు
- గడువు పెంచాలని ప్రజా సంఘాల డిమాండ్



ఈకేవైసీకి వచ్చిన వారిని సమస్యపై ఆరా తీస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: రేషన్ కార్డులో నమోదైన సభ్యులందరికీ ఈ-కేవైసీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో ప్రజలు మండుటెండనూ సైతం లెక్క చేయకుండా రేషన్ షాపుల వద్ద క్యూ కట్టడం కనిపించింది. స్థానిక నాగంపేట మున్సిపల్ పాఠశాల సమీపంలో రేషన్ షాపు వద్దకు శుక్రవారం ప్రజలు బారులు తీరడంతో, సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు చింతల సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు కూనిరెడ్డి రవికుమార్ డిపో వద్దకు వెళ్లి ఈ-కేవైసీ పనితీరును పరిశీలించారు. సర్వర్ సాంకేతిక సమస్య కారణంగా ఈ-కేవైసీకి జాప్యం జరగడంతో వృద్ధులు, మహిళలు ఎండలో నిలబడి నానా అవస్థలు పడ్డారు. దీనిని గమనించిన ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రేషన్ దుకాణాలకు సంబంధించి కార్డుదారులందరికీ ఒకేచోట ఈ-కేవైసీ చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి ఈ-కేవైసీ నమోదు తేదీ గడువును పెంచాలని డిమాండ్ చేశారు. మొత్తం 2,620 రేషన్‌కార్డులకు సంబంధించి సుమారు ఐదు వేల మందికి పైగా ఈ-కేవైసీ చేయాల్సి ఉందన్నారు. రోజుకు కేవలం 300 మందికి మాత్రమే ఈ-కేవైసీ అవుతునప్పుడు టోకెన్ సిస్టమ్ రోజుకు అంత మందికి మాత్రమే అవకాశం కల్పిస్తే, అందరూ క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరం ఉండదని చెప్పారు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



శిక్షణకు హాజరైన మహిళా సమాఖ్య సభ్యులు

ఎంపీడీఓ హిమమహేశ్వరి

సామర్లకోట: ప్రస్తుతం ఆదరణ పొందుతున్న ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల మహిళా సమాఖ్య సభ్యుల శిక్షణలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రసాయనాలు లేని ఎరువుల ద్వారా పంటలు పండిస్తే ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలు లభిస్తాయని తెలిపారు. అలాంటి వాటికి అధిక ధర లభిస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువ కావడంతో, పంటకు తెగులు వచ్చే అవకాశం ఉండదన్నారు. దశాబ్దాల క్రితం ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమికి సారం ఎక్కువగా ఉండేదన్నారు. వెదజల్లు పద్ధతి ద్వారా పెట్టుబడి వ్యయం తక్కువగా ఉంటుందని తెలిపారు. మండల సమాఖ్య సభ్యులు ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి, ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రయోజనాలను వివరించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఐ.సత్య మాట్లాడుతూ, మండలంలో రెండు వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నప్పటికీ, కేవలం 25 ఎకరాల్లో మాత్రమే ప్రకృతి వ్యవసాయం జరుగుతోందన్నారు. మిగిలిన రైతులు 50 శాతం రసాయన ఎరువుల వాడుతున్నారని చెప్పారు. రసాయన ఎరువుల వల్ల భూసారం కోల్పోతుందని, ఆహార ధాన్యాల్లో నాణ్యత ఉండదన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ధాన్యం విత్తనాలకు, ధాన్యానికి ప్రత్యేక ధర ఉంటుందని చెప్పారు. వెలుగు ఏపీఎం సీహెచ్ జగదీశ్వరి, ఉపాధి హామీ ఏపీఓ ఆర్.ప్రభాకరరావు మాట్లాడారు. సీఆర్పీ పి.రామలక్ష్మి శిక్షణ నిర్వహించారు.

విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించాలి

సబ్ స్టేషన్ వద్ద సీపీఎం ధర్నా



పెద్దాపురం సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం స్థానిక ఏపీఈపీడీసీఎల్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. తీరా అధికారం చేపట్టాక అవే మీటర్లు బిగించే కార్యక్రమాన్ని చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలపై విద్యుత్ భారం వేయబోమంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రజలపై వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారం మోపారని దుయ్యబట్టారు. అనంతరం ప్లకార్డులు చేతపట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, సుబ్బలక్ష్మి, దారపురెడ్డి సత్యనారాయణ, రొంగల వీర్రాజు, అరుణ్, కూనిరెడ్డి అప్పన్న, దారపురెడ్డి కృష్ణ తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా కాండ్రకోట నూకాలమ్మ జాతర



కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు



గరగను తెచ్చి జాతర నిర్వహిస్తున్న భక్తులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ ఈఓ ఆర్.సౌజన్య, ఉత్సవ ప్రత్యేకాధికారి వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ లాంఛనాలతో గ్రామానికి చెందిన గంటావారి కుటుంబం నుంచి గరగను తెచ్చి జాతర ఉత్సవాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని ఉత్సవమూర్తి అమ్మవారి విగ్రహానికి గరగ సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి మొక్కులను తీర్చుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాల మేరకు సీఐ కృష్ణభగవాన్, ఎస్సై మౌనిక ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ వద్ద కోలాటం, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్, దేవతామూర్తుల వేషధారణ, కాళికావేషాలు, డీజే షో, భారీ విద్యుద్దీపాలంకరణ మధ్య జాతర అంబరాన్నంటింది. మాజీ ఉప సర్పంచ్ ఎలిశెట్టి సూర్యచక్రప్రకాష్, లొల్లా అన్నవరం, పలువురు ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్పొరేట్‌తో మా పొట్ట కొట్టొద్దు

నాయీ బ్రాహ్మణుల నిరసన



పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

పిఠాపురం: తమ జీవనోపాధిని దెబ్బతీసే కార్పొరేట్ స్థాయి సెలూన్ షాపులకు అనుమతులు మంజూరు చేయవద్దంటూ పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక సూర్యరాయ లైబ్రరీ హాలులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్లకార్డులతో ర్యాలీగా స్థానిక మున్సిపల్ కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు సుందరపల్లి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షులు కింతాడ సత్యనారాయణ మాట్లాడుతూ, నాయీ బ్రాహ్మణుల జీవన భృతిని దెబ్బ కొడుతూ కార్పొరేట్ స్థాయి హంగులు, ఆర్భాటాలతో సెలూన్ షాపులు వేరే కులాల వారు నిర్వహిస్తూ, తమ కులానికి అన్యాయం చేస్తున్నారన్నారు. అటువంటి వారికి అనుమతులు మంజూరు చేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఎక్కడో ఉండి ఫ్రాంచైజీలు అమ్ముకుంటూ, పట్టణంలో భారీఎత్తున కార్పొరేట్ సెలూన్ షాపులు నిర్వహించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిని ప్రశ్నిస్తే.. మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోమంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణ బతుకులు అన్యాయం అవుతున్నాయని చెప్పారు. రూ.కోట్లు పెట్టుబడిగా పెట్టే సెలూన్ షాపులకు అనుమతులు మంజూరు చేయరాదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరుతున్నామన్నారు. తమ జీవనోపాధిని దెబ్బతీస్తూ, వ్యాపారంగా మార్చడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు స్వయంవరపు భద్రరావు, జిల్లా ప్రతినిధులు మెల్లిపాక నాగబాబు, నల్లమిల్లి అర్జుణకుమార్, వెన్నేటి సత్యనారాయణమూర్తి, తాతారావు, పిఠాపురం గౌరవాధ్యక్షుడు పసుపులేటి మంగ, ప్రెసిడెంట్ అల్లూరి వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నూకాలమ్మ జాతర



సామర్లకోట నూకాలమ్మ ఆలయం వద్ద గరగల నృత్యం



నూకాలమ్మ అమ్మవారు



డప్పు కళాకారుల విన్యాసాలు

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారి జాతర భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ ఉత్సవాలను ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ప్రారంభించారు. గరగలు, డప్పుల డ్యాన్సులతో అమ్మవారి ఎదురు ఆలయ మండపంపై నృత్య ప్రదర్శన చేసి, అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామ దేవతగా పేరొందిన నూకాలమ్మ అమ్మవారి జాతర శనివారం అమావాస్య నుంచి నెల రోజుల పాటు జరుగుతుంది. జాతరలో భాగంగా ఆలయం నుంచి రథం షెడ్, దేవీచౌక్, నీలమ్మ చెరువు, యార్లగడ్డవారి వీధి, పెద్ద వీధి, చిన్నవీధి, గాంధీచౌక్ నుంచి ఆలయం వరకు ఊరేగింపు జరిగింది. జాతరలో వివిధ వేషధారణలు, బ్యాండ్ మేళం, డప్పుల డ్యాన్సు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు కొనసాగింది. శనివారం అమావాస్య నుంచి అమ్మవారి దర్శనం ఉంటుంది. అమావాస్య రోజు స్థానిక జగ్గమ్మగారిపేటలోని శెట్టిబలిజ వర్గీయులు జాతర నిర్వహిస్తారు. నెల రోజుల పాటు అమ్మవారి ఆలయంలో ప్రతి రోజు పూజా కార్యక్రమాలు, వివిధ ఆధ్యాత్మిక, పారాయణ కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్త చెప్పారు. ఈ సందర్భంగా ఆలయానికి రంగులు, విద్యుద్దీపాలంకరణ, క్యూలైన్ల ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

టీటీడీసీలో నేడు జాబ్ మేళా

సామర్లకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, సిడాప్ సంయుక్తాధ్వర్యంలో స్థానిక టీటీడీసీలో శనివారం నిరుద్యోగులకు జాబ్ మేళా జరుగుతుందని సిడాప్ జేడీఎం కిరణ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు తెలిపారు. బ్లూటషన్ బయోటెక్‌లో పొడక్షన్ ఆపరేటర్, ట్రైనీ పోస్టులకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హత ఉన్నవారికి అవకాశం ఉంటుందన్నారు. కంపెనీ నిబంధన మేరకు జీతం ఉంటుందని చెప్పారు. టీమ్ లీజ్ కంపెనీలో బ్రాంచి రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, బ్రాంచి రిలేషన్ మేనేజరు పోస్టులకు ఇంటర్, డిగ్రీ కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఎల్‌జీ ఆథరైజ్డ్ సెంటర్‌లో ఫీల్డ్ ఇంజినీర్‌గా పని చేయడానికి ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ కలిగినవారు దరఖాస్తు చేయవచ్చన్నారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు 18 నుంచి 35 ఏళ్ల ఉండాలన్నారు. ఆసక్తి ఉన్నవారు శనివారం ఉదయం 10 గంటలకు బయోడేటా, ఆధార్, విద్యార్హతల సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో సామర్లకోట టీటీడీసీకి హాజరు కావాలన్నారు. వివరాల కోసం సెల్ 94407 56250, 99491 56583లో సంప్రదించవచ్చన్నారు.